ఇంటి పన్ను వద్దంటున్నారు!

- మర్మమెంటో అర్థం కావడం లేదు
- పంచాయతీ కార్యదర్శుల తీరుపై విమర్శలు


ఇంటి పన్ను రశీదు ఇస్తున్న కార్యదర్శి

మునిపల్లి(అందోల్): గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇంటి పన్ను, 15వ ఫైనాన్స్, జనరల్ ఫండ్స్‌తో అభివృద్ధి చేస్తుంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో స్పెషల్ అధికారుల పాలన కొనసాగుతోంది. దీంతో గ్రామాల్లో పనులు చేయాలంటే పంచాయతీ కార్యదర్శులే చేయించాల్సి ఉంటుంది. ఇంటి పన్ను వసూలు చేయాలని సంబంధిత జిల్లా అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు టార్గెట్ ఇచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లో కొందరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు చేస్తున్నా ఇంకొందరు కార్యదర్శులు ఇంటి పన్ను తీసుకోవడానికి ఇష్టపడడం లేదు. ఇంటి యజమానులు ఇంటి పన్ను కడతామని పంచాయతీ కార్యదర్శులను కోరినా తర్వాత కట్టండి అంటు చెబుతున్నారు. డబ్బులు తీసుకుని రశీదు ఇవ్వమంటే నెలల తరబడి గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారే తప్ప ఇంటి పన్నుకు సంబంధించి డబ్బులు తీసుకోకపోవడం మర్మమెంటో అర్థం కావడం లేదని పంచాయతీ కార్యదర్శుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏళ్ల తరబడి మండలంలోనే విధులు..

కొందరు పంచాయతీ కార్యదర్శులు బదిలీ కాకుండా 18 సంవత్సరాల నుంచి మునిపల్లి మండలంలోనే విధులు నిర్వహిస్తున్నారు. మండల అధికారులు బదిలీపై వెళ్తున్నారే తప్ప.. ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా పంచాయతీ కార్యదర్శులు మాత్రం బదిలీ కాకపోవడంపై జిల్లా, మండల అధికారుల తీరుపై మండల ప్రజలు మండి పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రతి సంవత్సరం ఏప్రిల్ జూన్ 30వ తేదీ లోగా టాక్స్‌లు వసూలు చేయాలి. కానీ చాలా మంది పంచాయతీ కార్యదర్శులు అందుకు అనుగుణంగా పని చేయడం లేదు. అలాంటి వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటాం.

–ఎంపీడీఓ డాక్టర్ హరినందన్‌రావు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 125 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా మంజూరైన కోటి 25 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, తహసీల్దార్‌లు రంగారావు, రాధ, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ సమస్యల పరిష్కారానికి కృషి

అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కొల్లూరులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నివాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూరు పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ నివాసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తమ కాలనీలో పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వారు వివరించారు. అలాగే, బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టా పొందిన లబ్ధిదారులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. సమష్టిగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, మున్సిపల్ శాఖల నుంచి మీకు అందాల్సిన అన్ని వసతులను అతి త్వరలోనే కల్పిస్తామన్నారు. కాలనీవాసులందరూ సొసైటీలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోగానే దుకాణాలను అలాట్‌మెంట్ చేస్తామని చెప్పారు. బస్సుసౌకర్యంతో పాటు ఇంటి నంబర్ల కేటాయింపు, విద్యుత్, తాగునీరు. డ్రైనేజీ సమస్యలను పరిష్కారిస్తామన్నారు. త్వరలోనే అంగన్‌వాడీ కేంద్ర, ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని వివరించారు. అనంతరం మున్సిపల్ నిధులతో నిర్మిస్తున్న కల్యాణ మండపం, స్త్రీశక్తి మహిళా క్యాంటీన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ మౌనిక, సీడీపీఓ జయరాం నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదనపు బస్సుల ఏర్పాటుకు వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల క్వార్టర్స్‌లో ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పటోళ్ల సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఖేడ్ ఆర్టీసీ డిపోకు అదనపు బస్సులు కేటాయించి, మెరుగైన సేవలను అందించాలని కోరారు. పలు అదనపు రూట్ల గురించి వివరించారు.

‘సేవ’కు సత్కారం



జహీరాబాద్: సామాజిక సేవలందిస్తున్న పలువురిని శనివారం సత్కారించారు. సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణానికి చెందిన మైత్రి మండలి అధ్యక్షురాలు అన్నపూర్ణ, సామాజిక సేవకురాలు జ్యోతి పండాల్‌ను సన్మానించారు. పండాల్ జ్యోతిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు.

వరి రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న నూతన్ కుమార్

నారాయణఖేడ్: డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఏడీఏ నూతన్‌కుమార్ పర్యటించారు. వరి సాగుచేసే భూములను పరిశీలించారు. వరిసాగు చేయనున్న రైతులకు కోతలు పూర్తయ్యాక అవశేషాలను కాల్చడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అలాగే, వరికొయ్యలను భూమిలోనే కలియదున్నడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వరిపంట సాగులో పాటించాల్సిన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌ఐ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం కిషన్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ జైపాల్ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి శనివారం బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించారు. ఎవరైన సెల్‌ఫోన్ పోగుట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొబైల్ షాపు నిర్వాహకులు బిల్, బాక్స్ లేకుండా ఫోన్లు అమ్మవద్దని సూచించారు.

నాగరాజ్‌కు సన్మానం


నాగరాజ్‌ను సన్మానిస్తున్న యువకులు

సదాశివపేట(సంగారెడ్డి): జాతీయ క్రిస్టియన్ కమ్యూనిటీ తెలంగాణ రాష్ట్ర గవర్నెన్స్ వింగ్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైనా నాగరాజ్‌ను శనివారం పట్టణంలోని ఇందిరనాగర్ కాలనీ యువత అధ్యక్షుడు మారెపల్లి సాయికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా నాగరాజ్ మాట్లాడుతూ.. క్రిస్టియన్ల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తాన్నారు. కార్యక్రమంలో ఇందిరానగర్ కాలనీ యువకులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరయింది. సంబంధించిన చెక్కులను శనివారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖేడ్ మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు రాజు, మాషుపటేల్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హత్నూర(సంగారెడ్డి): గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం హత్నూర మండలం సిరిపురం గ్రామంలో ఎమ్మెన్నార్ హాస్పిటల్ మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. టెస్టులు నిర్వహించి, మందులు, అవసరం ఉన్నవారికి ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మెడికల్ క్యాంప్‌లో 150 మందికి ఓపీ పరీక్షలు నిర్వహించగా పదిమందిని శస్త్ర చికిత్సల నిమిత్తం ఎమ్మెన్నార్ హాస్పిటల్‌కి తీసుకెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్, ఎమ్మెన్నార్ ఆస్పత్రి వైద్యులు మెడ్వాన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన


కల్హేర్(నారాయణఖేడ్): సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులను సూపర్‌చెక్ అధికారి, ఎంపీడీఓ రమేష్‌బాబు శనివారం పరిశీలించారు. కల్హేర్, మాసాన్‌పల్లి, బాచేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు నమోదు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీలు కృష్ణచారి, రజనికాంత్, సిబ్బంది నగేష్, షాకీర్, పరమేష్ పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును సర్వే చేయాలి

రాయికోడ్(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల కోసం పెట్టుకున్న ప్రతి దరఖాస్తుకు సంబంధించి సర్వే చేయాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ అన్నారు. రాయికోడ్, సింగితం గ్రామాల్లో శనివారం కొనసాగిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్‌తో కలిసి పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు చేసిన దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు సర్వేను పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ అంజలిదేవి, పంచాయతీ కార్యదర్శులు శివశంకర్, అనిల్‌కుమార్ ఉన్నారు.

దుద్యాల గ్రామంలో

వట్‌పల్లి(అందోల్): మండలంలోని దుద్యాల గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం అడిషనల్ పీడీ బాలరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన లబ్ధిదారులను వివరాలను రెండు రోజుల్లో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కల పెంపకంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీడీ పూజిత, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఎంపీడీఓ పాల్గొన్నారు.

‘పది’లో మెరుగైన ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ భీంసింగ్

మునిపల్లి(అందోల్): పదవ తరగతిలో అధిక మార్కులు సాధించాలని ఎంఈఓ భీంసింగ్ విద్యార్థులకు సూచించారు. శనివారం మునిపల్లి మోడల్ స్కూల్‌లో ఆయా పాఠశాలల కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పది విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరై ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను శ్రద్ధగా వినాలన్నారు. ఇంటి దగ్గర వెళ్లి పాఠాలను మరోసారి చదవాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి భాస్కర్, తుకారాం, నాగభూషణం, మాధురి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ నందన్ రతన్ ప్రైడ్ కాలనీవాసులు నిర్మించుకున్న కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ సర్పంచ్ దేవేందర్ రాజు శనివారం ప్రారంభించారు. రూ.2.5 లక్షలు మాజీ సర్పంచ్ దేవేందర్ రాజు ఆర్థిక సహాయం అందజేసినట్లు కాలనీవాసులు తెలిపారు. పిల్లలు ఆడుకునేందుకు పార్కును అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు రమణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి , అశోక్, కరుణాకర్, నాగరాజు, కోటి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయి బ్రెయిలీ జయంతి వేడుకలు


లవకుశంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వట్‌పల్లి(అందోల్): మండలంలోని మర్వెల్లి ఉన్నత పాఠశాలలో శనివారం లూయి బ్రెయిలీ 216వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి.. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న అంధ తెలుగు ఉపాధ్యాయుడు లవకుశంను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగిరెడ్డి, ఉపాధ్యాయులు సరస్వతి, సాయిలీల, విజయరావు, శ్రీదేవి, చంద్రప్రకాశ్, శ్రీనివాస్‌రావు, గంగాధర్, చంద్రశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం పాశమైలారానికి చెందిన యువతి(25), బోరంపేటలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. శనివారం తెల్లవారుజామున ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. కంది మండలం చర్లగూడెంకు చెందిన నాగరాజుపై అనుమానం ఉందని బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి విద్యార్థి వివరాలు నమోదు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ జోగప్ప

సంగారెడ్డి /కంది(సంగారెడ్డి): విద్యార్థుల వివరాలను కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన అపార్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం కంది, చౌటకూర్‌లో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమావేశం నిర్వహించి విద్యార్థుల వివరాలు నమోదు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జోగప్ప, బాలయ్యలు మాట్లాడుతూ.. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వివరాల నమోదుపై వారి అనుమతి తీసుకోవాలన్నారు. ఒకసారి నమోదు చేసిన వివరాలు విద్యార్థుల చదువు పూర్తి అయ్యేంత వరకు ఉంటాయన్నారు. అపార్‌లో నమోదు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రషర్ ఏర్పాటుపై ఆందోళన


విలేకరులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం నల్తూరులో క్రషర్ ఏర్పాటు చేయొద్దని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం గ్రామస్తులు విలేకరులతో మాట్లాడారు. క్రషర్ ఏర్పాటు ఆలోచన విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్రషర్ ఏర్పడితే వచ్చే పరిస్థితులను ఇప్పటికే గ్రామంలో పర్యటించిన జిల్లా మైనింగ్ ఏడి రఘు, స్థానిక తహసీల్దార్ భిక్షపతి ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో తెలియజేశామని తెలిపారు. క్రషర్‌తో రైతులు గ్రామస్తులే కాక పశుపక్షాదులు పర్యావరణం పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని వాపోయారు. జిల్లా కలెక్టర్ క్రషర్ ఏర్పాటు అనుమతులను రద్దుచేసి గ్రామస్తులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనార్దన్ బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజేష్ నాయకులు, భీమ్రావు యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశానికి కమ్యూనిస్టులే భవిష్యత్

ఎమ్మెల్సీ గోరటి వెంకన్న


కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న గోరటి వెంకన్న

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జనం కోసం మరణాన్ని సైతం చిరునవ్వుతో స్వీకరించేది కమ్యూనిస్టులేనని, ఈ దేశానికి భవిష్యత్ కమ్యూనిస్టుల సాంస్కృతిక, తాత్విక చింతన వల్లే నేటి చైతన్యమని ప్రజాకవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28 తేదీల్లో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన ‘జనకవనం’ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకన్న మాట్లాడుతూ.. నెహ్రూకాలంలో తనను తీవ్రంగా వ్యతిరేకించిన కృష్ణయ్యర్, అంబేడ్కర్ లాంటి వాళ్ల సైతం తన మంత్రివర్గంలో పని చేశారని, ప్రస్తుతం అలాంటి ప్రజాస్వామిక వాతావరణం లేదన్నారు. పుస్తకం రాసినా అమ్మినా ప్రశ్నించినా సహించలేని నియంతృత్వ ధోరణి పెరిగిందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. మనుషుల జీవితాల గురించి తపించే పార్టీ సీపీఎం అని పేర్కొన్నారు. సంధ్యా థియేటర్ తొక్కిసలాటలో మహిళ మరణించినా పోలీసులు, హీరో ఎవ్వరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కవులు డాక్టర్ చవా, సలీమా, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పుచ్చకాయ పంట పరిశీలన



జహీరాబాద్ టౌన్: మండలంలోని రంజోల్ గ్రామ పరిధిలో రైతులు సాగు చేస్తున్న పుచ్చకాయ పంటను శనివారం ఏరువాక కేంద్ర సంగుపేట శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంట సాగులో తీసుకోవాల్సిన చర్యలు, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. నీటి తడులు పరిమితికి మించి ఇవ్వొద్దని , సూక్ష్మ పోషకాలు అందించే ఎరువులు వేసుకోవాలన్నారు. పిందె రాలకుండా ష్లూ పైరాడి ఫోరాన్ మందును పిచికారీ చేయాలన్నారు. రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. ఆయన వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రదీప్‌కుమార్, రైతులు శ్రీకాంత్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులకు ఆహ్వానం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ, ఓపెన్ టు ఆల్ క్రీడాపోటీలకు కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్‌లను బీఆర్ఎస్ నాయకుడు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం వారివారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నారాయణఖేడ్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం ఖేడ్ ఎంఈఓ విశ్వనాథ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యులు మల్లికార్జున్, రాజయ్య, లక్ష్మణ్, వినయ్, గంగారాం, వివిధ మండలాల బాధ్యులు ప్రతాప్, మచ్చేందర్, సతీష్, రతన్, సుదర్శన్, కాశీనాథ్, ఓం బసవ విజయ్‌కుమార్, జగదీశ్, అంజయ్య, యోగేష్, శ్రీకాంత్, పద్మనాభం, ప్రవీణ్, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మునిపల్లి(అందోల్): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు శనివారం మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, తహసీల్దార్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ సహకారంతో ఆయా గ్రామాలకు చెందిన 33 మందికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ కృపాదానం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విఠల్‌రెడ్డి, నాగేశ్, ఖమ్మంపల్లి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

జహీరాబాద్: ఎమ్మార్పీఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడిగా టింకు మాదిగ ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎస్.ప్రశాంత్ కుమార్, నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా సుకుమార్, సహాయ కార్యదర్శులుగా సూర్యకాంత్, రాజేందర్, ప్రచార కార్యదర్శులుగా లాజర్, సురేష్‌లను ఎన్నుకున్నారు. సభ్యులుగా గుండు, మహేశ్, కృపరాజ్, సుధాకర్, ప్రభాకర్, నగేష్, చిన్న, ఆనంద్, సురేష్, బాబు, విల్సన్, స్టిఫెన్, ప్రశాంత్‌లు ఎన్నికయ్యారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉల్లాస్, జైరాజ్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు యువతకు ఇవ్వండి

కంగ్టి(నారాయణఖేడ్): నామినేటెడ్ పదవుల్లో యూత్ కాంగ్రెస్ నాయకులకు అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. శనివారం సచివాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివరాథోడ్ ఉన్నారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవుల్లో యూత్ కాంగ్రెస్ నాయకులకు అవకాశం ఇవ్వాలని కోరడంతో సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

పటాన్‌చెరు టౌన్: పాశమైలారం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ ఫీడర్ మెయింటెన్స్, చెట్లకొమ్మలు తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ జగదీశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉ.10:30 గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. కావునా వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహాసభలను విజయవంతం చేయండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాములు

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28 వరకు కొనసాగే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చుక్కరాములు కోరారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో శనివారం మహాసభల సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. మహాసభల్లో కేంద్రం, రాష్ట్రంలో నెలకున్న ఆర్థిక, సామాజిక అంశాలపై చర్చతో పాటు పేదలు, కార్మికులు, రైతులు, మహిళలు, నిరుద్యోగ సమస్యలపై విశ్లేషించి భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన చేస్తామన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాంచందర్, ఏరియ కార్యదర్శి మహిపాల్, సభ్యులు నర్సయ్య, చంద్రన్న, వీరయ్యగౌడ్, దశరథ్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400